మీ పిల్లలకైతే ఇలాంటి భోజనమే పెడతారా..?

- పిల్లలనుకున్నారా... పశువులనుకున్నారా....?
- సంబంధిత అధికారులపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం
- ఫుడ్ పాయిజన్ అయిన జాంగుడ పాఠశాలను కలెక్టర్ సందర్శన
- విచారణకు కమిటీ ఏర్పాటుచేసి కచ్చితంగా చర్యలు తీసుకుంటాం : ఐటిడిఎపిఓ

విశాలాంధ్ర- డుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో శుక్రవారం కలిసితమైన ఆహారం తిని ఫుడ్ పాయిజన్‌కు గురై కడుపు నొప్పి, వాంతులతో సుమారు 105 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై అరకులోయ ఏరియా హాస్పిటల్‌కు చేరారు. అస్వస్థతకు గురై శుక్రవారం రాత్రి 61 మంది విద్యార్థులు హాస్పిటల్ లో చేరగా శనివారం ఉదయం మరో 44 మంది విద్యార్థినిలు హాస్పిటల్‌లో చేరారు. ఈ విషయం తెలుసుకున్న అల్లూరి కలెక్టర్ దినేష్ కుమార్ హుటాహుటిన శనివారం ఉదయం జాంగుడ ఆశ్రమ బాలికల పాఠశాలలో సందర్శించి పాఠశాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలపై విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులను సిబ్బందిని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం పిల్లలకు వండిపెట్టిన పులిహోర నాసిరకంగా వండి పెట్టడాన్ని గ్రహించిన కలెక్టర్ పిల్లలా.. లేక పశువులు అనుకుంటున్నారా మీ పిల్లలకైతే ఇదే విధమైన నాసిరకమైన భోజనాన్ని వండి పెడతారా.. అంటూ జిల్లా కలెక్టర్ సంబంధిత ప్రధానోపాధ్యాయురాలు, మెట్రిన్, సుజాత డిడి కొండలరావులపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో విద్యార్థులకు మూడు పూటలు పెడుతున్న భోజన మెనూ ఏ విధంగా పెడుతున్నారనేపై దానిపై ఫోటోలు తీసి ఎప్పటికప్పుడు అప్లోడు చేయిస్తూ పర్యవేక్షణ చేయాలని

ఐటిడీఏ డిడి కొండలరావుకు, ఫోన్ లో పిఓ అభిషేక్‌కు ఆదేశించారు. ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విధినిర్వహణను తప్పకుండా పాటించాలని హెచ్చరించారు.

కచ్చితంగా చర్యలు తీసుకుంటాం-ఐటిడిఏపిఓ : ఫుడ్ పాయిజన్ అవ్వడానికి గల కారణాలపై ఐటీడీఏ డిడి, ఏ టి డబ్ల్యూ ఎంపీడీవో తాసిల్దార్ తో కమిటీ ఏర్పాటు చేసి సమగ్రంగా విచారణ నిర్వహించి బాధ్యులపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని, అస్వస్థతకు గురై వైద్యం పొందుతున్న విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని తల్లితండ్రులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఐటిడిఏపిఓ చెప్పారు. పిల్లలకు సంపూర్ణమైన మెనూ పెట్టడానికి గురుకుల పాఠశాలలో ఏ విధంగా నిత్యవసర సరుకులు కూరగాయలు సప్లై చేస్తున్నారు అదేవిధంగా ఆశ్రమ పాఠశాలల్లో కూడా ఆ విధంగానే సప్లై అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. దీనికి ముందు పాఠశాల మరుగుదొడ్లు పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు మధ్యాహ్న వండిపెట్టిన భోజనం పరిశీలించారు. అయితే మధ్యాహ్నం వండిపెట్టిన వంకాయ బటాని కూరలో బటాని సరిగా ఉడకపోవడంతో పాటు ,సాంబరులో పప్పు లేకపోవడాన్ని గ్రహించినాయన పిఓ ఉపాధ్యాయులపై అసహనం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి శ్రావణ్, ధొన్నుదొర సందర్శన, పరామర్శ : జంగూడ పాఠశాలలో జరిగిన సంఘటనలు తెలుసుకొని మాజీ మంత్రి మాజీ మంత్రి టిడిపి అరకు పార్లమెంటు ఇంచార్జ్ కిడారి శ్రావణ్ కుమార్, అరకు అసెంబ్లీ ఇన్చార్జ్ ఎస్ దొన్ను దొర పాఠశాలలు సందర్శించి ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలపై అధికారులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులందరూ కోలుకున్నారు

భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు : కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర-అరకులోయ: జిల్లాలోని కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విద్యార్థులందరూ కోలుకున్నారని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్ .దినేష్ కుమార్ తెలిపారు. డుంబ్రిగూడ మండలం జామి గూడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం రాత్రి గుడ్డు కూరతో ఆహారం తిన్న 61 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాయంత్రం 6:30 గంటలకు జమిగూడ ఆశ్రమ పాఠశాలలో భోజనం చేసిన విద్యార్థులకు వాంతులు ప్రారంభం కావడంతో వెంటనే వైద్యాధికారులు ఆశ్రమ పాఠశాలకు చేరుకుని వైద్యం అందించారని చెప్పారు. 61 మంది విద్యార్థులను అరకు వ్యాలీ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించడం జరిగిందని చెప్పారు. ఒక విద్యార్థి మలేరియాతో బాధపడుతున్నట్టు గుర్తించి ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు మెరుగైన వైద్యం అందిస్తున్నారని అన్నారు. డాక్టర్లందరూ అప్రమత్తంగా ఉన్నారని చెప్పారు. ముందుగా జామి గుడ ఆశ్రమం పాఠశాలను సందర్శించారు. ఆశ్రమ

పాఠశాలలో పారిశుధ్యం మెరుగుపడాల్సిన అవసరం ఉందని చెప్పారు.రెండు మూడు గంటలు అబ్జర్వేషన్‌లో ఉంచి విద్యార్థులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసిన గుడ్లలో మూడు బ్యాచ్‌లకు చెందినవి పాడైనట్టు గుర్తించడం జరిగిందని వాటిని ఎక్కడ ఎక్కడ సరఫరా చేశారో గుర్తించి వాటి స్థానంలో నాణ్యమైన గుడ్లు సరఫరా చేయడానికి చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బందిని మారుస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజు ఆశ్రమం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మెనూను ఫోటో తీసి ఐటిడిఏ పిఓలకు పంపించాలని ఆదేశించామని అన్నారు. జిల్లాలోని మూడు ఐటీడీఏలలో ఐటిడిఏ పిఓలు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలిస్తారని చెప్పారు. విద్యార్థులకు అందించిన ఆహార పదార్థాలను పరీక్షలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, ఆసుపత్రి వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

అల్పపీడన ప్రభావం ఉధృతం.. అప్రమత్తత అవసరం : తహసీల్దార్

విశాలాంధ్ర-చింతపల్లి : అల్పపీడన ప్రభావం ఉధృతంగా ఉంది. ప్రజలతో పాటు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ రామకృష్ణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. మండలంలోని పలు పంచాయతీలలో వాగులు పొంగి పొర ప్రమాదం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా గర్భిణీలను సమీప ఆసుపత్రులలో లేదా చింతపల్లి గర్భిణీల వసతి గృహానికి తీసుకురావాలని సూచించారు. అత్యవసరం అయితే తప్ప దూర ప్రాంత ప్రయాణాలు పెట్టుకోవద్దన్నారు. ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నందున చెట్లు కూలడం, రహదారి కోతకు గురి కావడం, వాగులు పొంగి ప్రవహించడం వంటివి జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో రాత్రి 8 గంటల నుండి ఉదయం ఏడు గంటల వరకు లంబసింగి - నర్సీపట్నం కొండ రహదారిలో ప్రయాణాలు నిషేధిస్తున్నట్లు ఆయన తెలిపారు.

మినీ అంగన్వాడీ కార్యకర్త హఠాన్మరణం బాధాకరం

ఐసిడిఎస్ సిడిపిఓ రమణి

విశాలాంధ్ర-చింతపల్లి : మండలంలోని కిటుముల పంచాయతీ పకాబు గ్రామంలో మినీ అంగన్వాడి కార్యకర్తగా పనిచేస్తున్న రాడా దేవుడమ్మ (43) గుండెపోటుతో హఠాన్మరణానికి గురికావడం బాధా కరంగా ఉందని ఐసిడిఎస్ సిడిపిఓ రమణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఎంతో చురుకుగా అంగన్వాడీలో సేవలు అందించే మినీ అంగన్వాడీ కార్యకర్త దేవుడమ్మ గుండెపోటుతో మృతి చెందడం విచారకరం అన్నారు. ఆమె మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులు మనో నిబ్బరం కలిగి ఉండాలన్నారు. దేవుడమ్మ మృతి తీరని లోటన్నారు. అంగన్వాడీలు ఆరోగ్య విషయంలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దేవుడమ్మ సేవలను ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు.

తల్లి పేరు మీద ఒక చెట్టు

మన రేపటి కోసం

విశాలాంధ్ర-జీకే వీధి : గూడెం కొత్త వీధి మండలం ఐసిడిఎస్ కార్యాలయంలో సిడిపిఓ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శనివారం ఏక్ పీడ్ మా కే నామ్ ఒక చెట్టు అమ్మ పేరు అను చెట్టు నాటే కార్యక్రమం ద్వారా ఐసిడిఎస్ ప్రాంగణంలో మొక్క నాటడం జరిగింది. సిడిపిఓ లక్ష్మీదేవి మాట్లాడుతూ మండలంలో అన్ని అంగన్వాడి కేంద్రాల్లో మొక్కలు నాటడం జరిగిందన్నారు. వృక్షో రక్షిత రక్షిత పచ్చని చెట్లు - ప్రగతికి మెట్లు, అని ఇంటింటా -చెట్లు ఊరంతా -పచ్చని చెట్లు అని నినాదాలతో చేస్తూ చెట్టు యొక్క విశిష్టతను తెలియజేస్తూ మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మోహిని, రామలక్ష్మి, కృష్ణకుమారి, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జర్రెల పంచాయితీలో రాజ్మా విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర-జికె వీధి: జర్రెల పంచాయితీ రైతు మీసేవ కేంద్రంలో కార్యాలయంలో సర్పంచ్ వీరోజి నాగరాజు, జనసేన మండల కార్యదర్శి పోత్తూరు విష్ణుమూర్తి, ఎంపీటీసీ సమక్షంలో రాజ్మా విత్తనాలు రైతులకు పంపిణీ చేయడం జరిగింది. జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పొత్తూరు విష్ణుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న 90 శాతం సబ్సిడీతో రైతులకు రాజ్మా చిక్కులు విత్తనాలను సకాలంలో పంపిణీ చేయడం జరిగిందని ప్రతి ఒక్క రైతు రాజ్మా పంట వెయ్యాలని ఎవరు అమ్మడానికి పాల్పడకూడదని రైతులకు తెలియజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ రాజ్మా విత్తనాలను పంచాయతీ పరిధి గ్రామ గ్రామ రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ శశాంక్ సర్పంచ్ ఎంపీటీసీ కూటమి సభ్యులు బాబురావు రాజుబాబు సంతోష్ కొండబాబు జనసేన పార్టీ నాయకులు ముర్ల శ్రీను చిన్న బిజెపి పార్టీ నాయకులు కె రామచంద్రరావు సత్తిబాబు పాల్గొన్నారు.

ఎంఆర్‌జిఎస్‌లో అవకతవకలు, చేయని పనులకు రూ.8.5 లక్షల చెల్లింపులు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం గత సంవత్సరం జరిగిన ఎం ఆర్ జి ఎస్ పనుల్లో అవకతవకలు జరిగినట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు,మండలంలో చాలా చోట్ల మట్టి రోడ్ల పనులు అసంపూర్తిగా జరిగితే,పనులు పూర్తిగా జరిగినట్లుయూ చెల్లింపులు చేశారని,వీటి విలువ సుమారు 8.5 లక్షల రూపాయలని ఎంపిడిఓ యాదగిరీశ్వరావు తెలిపారు,ఆ సొమ్ము రీకవరి నిమిత్తం ఆ పనులను తిరిగి పూర్తి చేయలని అధికారులు అదేశాలిచ్చినట్లు తెలిపారు.

జిల్లాలో భారీ వర్షాలు నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : రానున్న మూడు నాలుగు రోజుల జిల్లాలో భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఈ మేరకు శనివారం సాయంత్రం జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్లో 24 గంటలు పనిచేసే విధంగా 08935299912, 08935293448 నంబర్లతో కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలలో కూడా కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని తహశీల్దార్ %డ% ఎంపీడీఓ కార్యాలయాలలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి వీలుగా 24 గంటలు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అధికారులు సిబ్బంది అందుబాటులో ఉండాలనికలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, సన్నద్ధతలో భాగంగా తమ సిబ్బందిని అప్రమత్తం చేయాలని ఆయా కార్యాలయంలలో కంట్రోల్ రూమ్‌లను తెరిచి, నష్టపరిహారం గురించి సమాచారాన్ని ఎప్పటికప్పుడు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు తెలియజేయాలని సూచించారు. జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని, తుఫాను నష్టాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల ప్రకారం, రాబోయే 24 గంటల్లో ఉత్తర మరియు ఆనుకుని ఉన్న మధ్య బంగాళాఖాతంలో తాజా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, ఇది రాబోయే 4 రోజులలో పశ్చిమ-వాయువ్య దిశగా దక్షిణ ఒడిశా %డ% ఉత్తర ఆంధ్రప్రదేశ్ తీరాలకు దగ్గరగా వెళ్లే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆగస్ట్ 29 నుండి అక్టోబర్ రెండు వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు.

ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఎమ్మెల్యే విజయ చంద్ర అన్నారు. పార్వతీపురం నియోజకవర్గం లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ప్రతినెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ జరిగేదని కానీ ఈసారి ఒకరోజు ముందుగానే వికలాంగులు, వితంతువులు వృద్ధులకు పండగ వచ్చిందన్నారు.పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అందుకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసుకుంటూ ముందుకు వెళు తున్నారని ఆయన అన్నారు. ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమం రెండు కళ్ళుగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ : తహశీల్దార్

విశాలాంధ్ర-కురుపాం : మొక్కలు పెంపకము ద్వారా పర్యావరణ పరిరక్షణ మార్గం సుగమం అవుతుందని కురుపాం తహశీల్దార్ రవణమ్మ అన్నారు. శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జనసేన ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మొక్కలు సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఎస్ వంశీ శ్రీరామ్, మురళి, రవి, ప్రసాద్, రాధాకృష్ణ, సాయి, రెవెన్యూ సిబ్బంది

వేతనాలను చెల్లించాలి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రం (సి హెచ్ సి) లో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బందికి రావాల్సిన జీతాలను చెల్లించాలని కోరుతూ ఆసుపత్రివద్ద నిరసన తెలియచేసారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా గత 13 రోజులుగా దశలవారీగా నిరసనలు తెలియజేస్తున్నామని తెలిపారు. గత ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబ భారం కష్టంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు లేనప్పటికి తమ విధులను నిర్విరామంగా చేస్తున్నామన్నారు. దీంతో పాటు రావాల్సిన పి ఎఫ్ నంబర్లు హెల్త్ కార్డులు ఈఎస్ఐలు కూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు .ఈకార్యక్రమంలో సూపర్ వైజర్ వి. క్రాంతి కుమార్ శానిటేషన్ సిబ్బంది ఎస్ నీలమ్మ, గోవిందమ్మ, గౌరీశ్వరమ్మ, గౌరునాయుడు సత్యనారాయణ, గౌరమ్మలు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలకు కదలిరండి

విశాలాంధ్ర-పాచిపెంట : సెప్టెంబర్ 2వ తారీఖున జనసేన అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించబడునని జనసేన యూత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పాచిపెంట మండలం పరిధిలోని జనసేన నాయకులు జనసేన ఉమ్మడి కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఉదయం 6 గంటలకు శివాలయంలో ప్రత్యేక పూజలు, 8 గంటల నుంచి పాచిపెంట మరి చెట్టు వద్ద ఉన్న కమ్యూనిటీ భవనం దగ్గర రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నారు.10 గంటలకు పి హెచ్ సి లో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమం జరుగుతోందని తెలిపారు మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, మరియు కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 3 గంటలకు మొక్కలూ నాటే కార్యక్రమం ఉంటుందని అన్నారు. సాయంత్రం ఐదు గంటలకు గరెళ్ల వలస గ్రామంలో కేక్ కటింగ్, రాత్రి 7గంటలుకు ఎగువవీధిలో కేక్ కటింగ్ పలుకార్యక్రమాలు నిర్వహిస్తామని పాచి పెంట జనసేన నాయకులు, కార్యకర్తలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాచిపెంట మండల పరిధిలో ఉన్న జనసేన నాయకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేస్తారని ఇప్పటికే మండల పరిధిలో గల జనసేన నాయకులకు కార్యకర్తలకు ఉమ్మడి పార్టీ నాయకులకు సమాచారం అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దారు రమణ

విశాలాంధ్ర-సాలూరు రూరల్: రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎన్.వి.రమణ సూచించారు.ఈమేరకు శనివారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారన్నారు.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వాగులు,గెడ్డలు పొంగి పొరలే అవకాశం ఉందన్నారు.గెడ్డల పరివాహక ప్రాంతాలలో ఉన్నవారు అత్యవసర పరిస్థితుల్లో తప్ప మిగిలిన సమయంలో బయటకు రావొద్దని సూచించారు.అదేవిధంగా సోమవారం పాఠశాలలకు,అంగన్‌వాడీ కార్యాలయాలకు, అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారన్నారు.శనివారం మండలంలో శివరాంపురం గ్రామాన్ని సిబ్బంది తో పాటు సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేయడం జరిగిందని తహశీల్దారు తెలిపారు.వరదనీటి హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేశారు. సిబ్బందితో మాట్లాడుతూ భారీ వర్షసూచన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.ప్రాణనష్టం, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవవీరుడు అల్లూరికి వారసులు కమ్యూనిస్టులే...

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ

విశాలాంధ్ర-చింతపల్లి : బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు తరువాత అంతటి పోరాట పటిమను చూపి గిరిజనులకు అన్ని విధాలుగా అండగా నిలిచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, అల్లూరికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ అన్నారు. ఆ పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన స్థానిక వర్తక సంఘం భవనంలో నిర్వహించిన అల్లూరి జిల్లా సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన ఆయన సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ అల్లూరి జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ బలోపేతంగా ఉండేదన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా, ఎంతమంది అధికారులు మారిన మన్య ప్రాంతంలో సిపిఐ పార్టీ చెక్కుచెదరని పార్టీగా ఉండేదన్నారు. ఎన్నో భూ పోరాటాల ఫలితంగా ఈప్రాంతంలో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన నిలిచిందన్నారు. 40 వేల ఎకరాల భూమిని ఈ ప్రాంత ప్రజలకు పంచి ఇచ్చిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అన్నారు. అంతటి చరిత్ర కలిగిన పార్టీ నేడు నియోజకవర్గాల పునర్విభజనలో చింతపల్లి నియోజకవర్గం కనుమరుగు కావడంతో భారత కమ్యూనిస్టు పార్టీ చాలావరకు నష్టపోయిందన్నారు. నేటికీ ప్రజల పక్షాన తన గళాన్ని వినిపించే పార్టీగా ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీకి గుర్తింపు చెరిగిపోలేదన్నారు. రాష్ట్రంలో వైకాపా హవా కొనసాగినప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలలో అంజలి శనివారం పంచాయతీని, ఎర్రబొమ్మల ఎంపీటీసీ స్థానాన్ని సిపిఐ పార్టీ కైవసం చేసుకోవడం ఈప్రాంతంలో సిపిఐ పార్టీకి ఉన్న ప్రజాదరణకు నిదర్శనమన్నారు. నాటి పోరాటాల ఫలితంగా ఎన్నో గిరి గ్రామాలు ఏర్పడ్డాయి అన్నారు. వాటి గురించి నేటి యువతకు తెలియజేయవలసిన బాధ్యత నాటి పెద్దలపై ఉందన్నారు. బూర్జువా పార్టీలు పుట్టుకొచ్చి నగదు రాజకీయాలు చేయడం వలన యువత వాటికి ఆకర్షితులు అవుతున్నారన్నారు. నగదు రాజకీయాల వలన తాత్కాలికంగా లబ్ధి చేకూరినప్ప టికీ, భవిష్యత్తు తరాలకు నష్టం జరిగే అవకాశాలు లేకపోలేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమల మాట్లాడుతూ సమాజంలో మహిళలకు భద్రత కరువైందన్నారు. వయో భేదం లేకుండా అత్యాచారాలకు హత్యలకు తెగబడుతున్న మానవ మృగాలను మనం చూస్తున్నామన్నారు. కఠినమైన చట్టాలు ఉన్నప్పటికీ ఆస్థాయిలో శిక్షలు అమలుచేయకపోవడం వలన మానవ మృగాలు పెట్రేగిపోతున్నాయి అన్నారు. ప్రాణాలు పోసే వైద్యురాలిని సైతం పొట్టన పెట్టుకున్న కీచకులు ఉన్న సమాజంలో మనం జీవిస్తున్నందుకు సిగ్గుగా ఉందన్నారు. మహిళలపై అత్యాచారాలు అచ్చులకు తెగబడుతున్నవారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చింతపల్లి జికెవిది, కొయ్యూరు మండలాల కార్యదర్శిలు, నాయకులు, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

మన్యంలో విజయవంతంగా పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-సీతంపేట : మండలం పరిధిలో 53 పంచాయతీల్లోకూటమి ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఒక్కరోజు ముందుగానే పెన్షన్ల పంపిణీ చేయటంతో పెన్షనర్ల హర్షతిరేకాలు తెలియజేశారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్ల పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది మరియు కూటమి నాయకులు,గత ప్రభుత్వం ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్లు అందజేసేదని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఒకరోజు ముందుగానే పెన్షనర్లకు ఇంటింటికి వెళ్లి పెన్షన్లను అందించుటకు చర్యలు తీసుకోవడం ఎంతో సంతోషమని అన్నారు. పాలకొండ శాసనసభ్యులు వారు నిమ్మక. జయకృష్ణ ఆదేశాల మేరకు నియోజకవర్గం ఐ టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ ఇమరక. పవన్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు సవర తోట ముఖలింగం, జనసేన పార్టీ సీతంపేట మండలం అధ్యక్షులు మండంగి విశ్వనాధం తుంబకొండ పంచాయతీ పరిధిలో జల్లార మరియు ఇతర పంచాయతీ గ్రామాల్లో పాల్గొన్నారు. శనివారం చిన్నబగ్గా, మర్రిపాడు పంచాయతీ పరిధిలో సర్పంచ్ నీలయ్య ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతలు చూపించే ప్రభుత్వమని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలలోనే ప్రజారంజక పాలన అందిస్తుందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారధ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందని పేర్కొన్నారు. పాలకొండ నియోజకవర్గం లో పెండింగ్ సమస్యల ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పరిష్కరిస్తారని అలాగే తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు.ఇతర కూటమి నాయకులతో మమేకమై సమస్యల సాధన కోసం అహర్నిశలు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు మారిషస్ ఫైనాఫిల్ సరఫరాకు టెండర్లు ఖరారు

విశాలాంధ్ర -సీతంపేట: ఐటిడిఎ పరిధిలోని సీతంపేట, భామిని మండలాల్లో 110 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టబోయే మారిషస్ రకం ఫైనాఫిల్ మొక్కల గిరిజన రైతులకు సరఫరాకు ఐటిడిఎ పీవో వి.వి.రమణ ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించడమైనది. ఈ టెండర్లలో మొత్తం 11 మంది టెండర్ దారులు పాల్గొన్నారు. టెండరులో మార్షస్ పైనాపిల్ మొక్కలు సరఫరా చేయుటకు టెండర్లు దక్కించుకున్న వారు నాణ్యమైన క్వాలిటీ మారిషస్ ఫైనాఫిల్ మొక్కలను మాత్రమే సరఫరా చేయాలని, మొక్కల సరఫరాలో నాణ్యత లోపించకూడదని ఎటువంటి అవకతవకలకు పాల్పడిన బిల్లులు చెల్లింపులు నిలుపుదల చేస్తామని పీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ వో గణేష్, రస్తగొంటబాయి కేవీకే శాస్త్రవేత్త ఎస్.ఎస్.శ్రీనివాసరాజు, సీతంపేట అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ శాస్త్రవేత్త బి.జ్యోతిబసు, లక్ష్మీనారాయణ, కమిటీ మెంబర్లు డీఎం జీసీసీ సంధ్యారాణి, ఏటీడబ్ల్యూవో మంగవేణి, హెచ్ వోలు అమరేశ్వరి, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కొండను ఢీకొట్టిన లారీ

డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-పాచిపెంట : నవరంగపూర్ నుండి దాన లోడుతో కాకినాడ వెళుతున్న లారీ శుక్రవారం రాత్రి అదుపుతప్పి కొండను ఢీకొట్టడంతో డ్రైవర్ జట్ల తాత రావు అక్కడకక్కడ మృతి చెందినట్లు పాచిపెంట పోలీసులు తెలిపారు .జట్ల తాతారావు కుమారుడు జట్లు విజయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాచిపెంట పోలీసులు తెలిపారు.

ప్రతి తల్లి కోసం ఒక చెట్టు

విశాలాంధ్ర-గంగవరం : ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రతి తల్లి కోసం ఒక చెట్టు అనే కార్యక్రమం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ గంగవరంలో నిర్వహించినట్లు సిడిపిఓ లక్ష్మీ తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాహ్ 2024 కార్యక్రమంలో భాగంగా ఈరోజు 31.08.2024వ తేదీన ఈకేపిఈడి మా ఎంఏఏకేఈ నామ్ '(ప్రతి తల్లికోసం చెట్టు) అనే కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఏడబ్ల్యుసి ఏడబ్ల్యుసి స్థాయిలో కూడా నిర్వహించడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన డబ్ల్యు ఈ బి ఈ ఎక్స్ (వీసి), సూపరవైజర్స్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 2024 నుండి 30.09.24 వరకు నిర్వహించే పోషణ్ మాహ్‌కు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను మంత్రివర్యులు అన్నపూర్ణదేవి గారు వివరించడంజరిగిందన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం ప్రతి స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

సమాజంలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిది

సిపిఐ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-చింతపల్లి : సమాజంలో జరుగుతున్న మార్పులతో పాటు వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడంలో పాత్రికేయుల పాత్ర ఎనలేనిదని సిపిఐ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో సిపిఐ పార్టీ అల్లూరి జిల్లా సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజంలో విలేకరుల పాత్ర చాలా కీలకమైంది అన్నారు. అటు ప్రభుత్వానికి, ఇటు అధికారులకు ప్రజల సమస్యలను తెలియజేయడంలో పాత్రికేయులు పోషిస్తున్న పాత్ర ఎనలేనిదన్నారు. ఎటువంటి వేతనాలు లేకపోయినప్పటికీ నిత్యం ప్రజాసమస్యలను వెలికి తీస్తూ, లాభాపేక్ష లేకుండా సమాజాభివృద్ధికి కృషి చేసే వారిలో విలేకరులే మొదటివారన్నారు. సమాజాభివృద్ధికి, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే విలేకరులను సత్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం తమ కథనాలతో ప్రజా సమస్యలను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకువెళ్తూ విభిన్న కథనాలతో నిత్యం వార్తా సేకరణలో ఉంటూ విశాలాంధ్ర పత్రికకు మన్య ప్రాంతంలో మంచి గుర్తింపు తీసుకువచ్చిన స్థానిక విశాలాంధ్ర పాత్రికేయుడు షేక్ కాసింవల్లి, జీకే వీధి విశాలాంధ్ర పాత్రికేయుడు హనుమంతరావు లను సిపిఐ పార్టీ అల్లూరు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ ఆధ్వర్యంలో చింతపల్లి జీక వీధి మండలాల కార్యదర్శులు పేట్ల పోతురాజు కంకిపాటి సత్తిబాబులు దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఆర్) నందు పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుండ్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో రెండుసార్లు ఎన్నిక వాయిదా పడిందని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఈరోజు జరిగిన ఎన్నిక విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు చొరవతో ఏకగ్రీవంగా జరగడంతో ఉత్కంఠతకు తెరదించినట్లు అయినదని విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా రేవల్ల సాయిరాం, వైస్ చైర్మన్‌గా మజ్జి కరుణలను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, ఈఎన్నిక కార్యక్రమంను మండల విద్యాశాఖ అధికారి 2 ముదిలి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగింది .ఆయన మాట్లాడుతూ ఈపాఠశాల ఎన్నిక పూర్తి కావడంతో మండలంలోని అన్ని పాఠశాలలకు ఎన్నికలు పూర్తయ్యాయని ఆయన చెప్పారు. ఈప్రక్రియలో సిఆర్‌పి అంబెరు పోలినాయుడు పాఠశాల సహోపాధ్యాయులు వై సన్యాసిరావు మండల ఎస్సై పి అనిష్, కానిస్టేబుల్ జి గోపిరావు, ఏప్రసాద్, ఎస్ శ్రావణి, గ్రామ పెద్దలు గురాణ శ్రీరామ్ మూర్తి నాయుడు రేవల్ల రామమూర్తినాయుడు,పల్లి కొండయ్య, కర్రి రాజేంద్ర నాయుడు, వంజరాపు దామోదరనాయుడు, కొండా బత్తుల కుమార్, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : యుటిఎఫ్

విశాలాంధ్ర-గంగవరం : అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, సమాజంలో ఉపాధ్యాయుడు ఎంతో ఆదర్శప్రాయుడని యుటిఎఫ్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎంటిఎస్ ఉపాధ్యాయురాలు తూలూరి హాదస్సా బేబీ వైనింగ్ పదవీ విరమణ సందర్భంగా యుటిఎఫ్ ర్పాటుచేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. 1998 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ కొన్ని సాంకేతిక కారణాలవల్ల శాశ్వత ప్రాతిపదికన ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం పొందలేకపోయారన్నారు. 20 23 ఏప్రిల్ లో ఎంపీ ఎస్ ఉపాధ్యాయురాలుగా చేరి 15 నెలలు మాత్రమే ఉపాధ్యాయురాలుగా పని చేశారన్నారు. ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత కుమారి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. పవిత్రమైనదని భావి భారత పౌరులను తీర్చిదిద్దే అపూర్వమైన బాధ్యత ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని, హదస్స మేడం గారు పనిచేసింది తక్కువ కాలమే అయినప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించారని, వారి శేష జీవితం ఆరోగ్యంతో ఉండాలని వారు ఆకాంక్షించారు. గ్రామస్తులు కూడా ఘనంగా సన్మానించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్య ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎం. నాగదేవి, యుటిఎఫ్ మహిళ అధ్యక్షురాలు రుక్మిణి, సహ అధ్యక్షులు కారం బొజ్జి దొర, మహిళా నాయకులు కారం లక్ష్మి, కె.భవాని, ఎస్ ఆర్ విజయలక్ష్మి, ట్రెజరర్ సత్య కిరణ్ రెడ్డి, జి. వి. వి. సత్యవేణి, వి. వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

తుపాన్ పట్ల అప్రమత్తత అవసరం : జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర-పార్వతీపురం : తుఫాను ప్రభావం అధికంగా ఉంటుందని, అప్రమత్తంగా ఉండాలని, అందుకు తగ్గ చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ఆదేశించారు .తుఫాను రాబోవు నాలుగైదు రోజులు ప్రభావం ఉంటుందని సైక్లోన్ ఎఫెక్ట్ ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వారు హెచ్చరిక జారీచేయడం జరిగిందని, రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా అధికార యంత్రాంగంతో టెలికాన్ఫరెన్సు నిర్వహించి తుఫాను ప్రమాద నివారణకు చేపట్టవలసిన చర్యలు గురించిజాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగిందన్నారు. చెరువులు, కాలువలు, నదులు, కొండ దిగువ కాలువలు దగ్గర వాటర్ ఫ్లో ఎక్కువగా ఉన్నప్పుడుఅక్కడ ప్రజలను దాటనీయకుండా తగిన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసుకోవలెనని తెలిపారు.ఈమధ్య కాలంలో పాచిపెంట మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు స్కూటీ మీద నదిదాటుతుండగా నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించిన సంఘటన తెలియజేస్తూ అలాంటివి పునరావృతం అవ్వకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేసారు. అన్ని శాఖలతో సంబంధం చేసుకుని పోలీస్ సిబ్బంది పనిచేయాలన్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

సిఐఎస్ గోవిందరావు

విశాలాంధ్ర-కొమరాడ : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటూ శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఎస్సై కే.నీలకంఠం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పార్వతీపురం రూరల్ సీఐ ఎస్ గోవిందరావు హాజరయ్యారు మన్యం జిల్లా ఎస్పీ ఎస్వి మాధవ రెడ్డి ఆదేశాల ప్రకారం యువతీ యువకులు మంచి ఉన్నత చదువులు చదువుకోవాలని తల్లిదండ్రులకు కాలేజీకి మంచి పేరు తీసుకురావాలని అలాగే యువతి యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలంటూ ముఖ్యంగా మత్తు పదార్థాలకు వంటి గంజాయి మద్యం డ్రగ్స్ స్త్రీలు పై గౌరవంగా మెలుసుకోవాలని భావితరాలకు విద్యార్థులే కీలకమని ఇప్పటి నుంచే మంచి అలవాట్లు చేసుకోవాలని వాళ్లని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై నాగేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని 35 గ్రామపంచాయతీలో శనివారంనాడు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సక్రమంగా చేపట్టినట్లు మండల పంచాయతీ విస్తరణ అధికారి కుమార్ వర్మ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో సచివాలయ సిబ్బంది పంచాయతీ, కార్యదర్శులు దగ్గరుండి ఇంటింటికి పెన్షన్లు పంపిణీ చేశారన్నారు. మండలంలో 11వేల 306 పింఛన్లకుగాను నాలుగు కోట్ల 67 లక్షల 87 వేల ఐదువందల రూపాయలను ప్రభుత్వం కేటాయించగా 95శాతం పింఛన్లపంపిణీ మొదటరోజు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన వారికి సోమవారం అందజేయడం జరుగు తుందన్నారు. ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, టీడీపి, బీజేపి, జనసేన నాయకులు కూడా పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారని తెలిపారు.

గంగవరం :ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ నియోజకవర్గం శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీషదేవి భాస్కర్‌ల ఆదేశాల మేరకు ఈరోజు గంగవరం మండలంలో గంగవరం పంచాయతీలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ మాట్లాడు ప్రభుత్వ పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులను కోరారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని కూటమి నాయకులకు సూచించారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమాల్లో భాగంగా మొల్లేరు లో జరిగిన కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు పాము అర్జున పాల్గొన్నారు. అలాగే గంగవరం పెద్దడపల్లి గ్రామాల్లో జరిగిన పంపిణీ కార్యక్రమాల్లో టిడిపి మాజీ మండల కోఆప్షన్ సభ్యులు కొమ్మన చిన్నారావు జనసేన మండల పార్టీ అధ్యక్షుడు, కే సిద్దు, జనసేన ఉపాధ్యక్షులు గవర్ రాజు వెటర్నరీ ఆఫీసర్ నాగేశ్వరరావు మహిళా పోలీస్ గంగభవాని ,అలాగే ఎండపల్లి పంచాయతీ,పెద్ద అడ్డపల్లి,చిన్న అడ్డపల్లి, గ్రామాల్లో పార్టీ నాయకుడు మొల్ల చిన్నిబాబు, భూత్ ఇన్చార్జ్ వినయ్, ఏఎన్ఎం అనూష, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అనంతగిరి : మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు అనంతగిరి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నగేష్ తెలిపారు. ఒకటవ తేదీ ఆదివారం కావడం వల్ల ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఆగస్టు 31 శనివారం నాడు వృద్ధులకు, వితంతులకు, వికలాంగులకు పెన్షన్లు ఇంటింటికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మండలంలో 6050 మంది పెన్షన్ దారులు ఉన్నారని వీరికి గాను రెండు కోట్ల 51 లక్షల 63 వేల రూపాయలు పంపిణీ జరుగుతుందని తెలిపారు. శనివారం మధ్యాహ్నంకి 100% పంపిణీకి సచివాలయ సిబ్బంది ద్వారా సర్వం సిద్ధం చేశామన్నారు. ఇతర ఏవైనా కారణాలవల్ల ఇంకా ఎవరికైనా మిగిలి ఉంటే సెప్టెంబర్ 2 సోమవారం నాడు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా కొత్తూరు పంచాయతీ

కేంద్రంలో గల పెన్షన్ దారులకు పంచాయతీ ఉప సర్పంచ్ గాలి నరసింహమూర్తి(నరేంద్ర) చేతుల మీదుగా సచివాలయ సిబ్బంది పంపిణీ నిర్వహించారు. అలాగే తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం ఆయా పంచాయతీలలో తెలుగుదేశం నాయకుల సమక్షంలో పంపిణీ చేపడుతున్నారు.

రాజవొమ్మంగి : ఎమ్మెల్యే రాజవొమ్మంగి

మండలం అనంతగిరి గ్రామంలో పెంక్షన్ దారుల ఇంటింటికి వెళ్లి పెంక్షన్లు పంపిణీ చేశారు. సెప్టెంబర్ 1వ తారీకు ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పెంక్షన్ల పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు,అలాగే మండలం మొత్తం పెంక్షన్ల పంపిణీ జరిగినట్లు ఎంపిడిఓ యాదగిరీశ్వరావు తెలిపారు. ఈ పంపిణీలో అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కురుపం నియోజకవర్గం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో కృష్ణ, గరుగుబిల్లి రవి, జగన్నాథం, చిన్నా, దమయంతి, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎటపాక: శనివారం ఎన్డీయే ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఒకటో తారీకు పెన్షన్ ఇచ్చే అవకాశం వుండగా ఒకటో తారీకు ఆదివారం రావడంతో పెన్షన్ దారులు ఎవరు ఇబ్బందులు పడకూడదని పెద్ద మనసుతో ఆలోచించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఒక మంచి నిర్ణయం తీసుకొనీ శనివారం 31 వ తేదీ పెన్షన్ దారులకు పెన్షన్ అందజేసారు. దీంతో పెన్షన్ దారులు అందరు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజా శ్రేయస్సు లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ వారు తీసుకున్న నిర్ణయం పట్ల జనసేన పార్టీ ఎటపాక మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ హర్షం తెలిపారు.

అనధికార లేఔట్లు, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

- **సమావేశంలో అధికారులను నిలదీసిన టిడిపి**
- **విశాలాంధ్ర కథనాలపై స్పందన**

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: మున్సిపాలిటీ లోని పలు ప్రాంతాలలో అనధికార లేఅవుట్లు, అక్రమ కట్టడాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని వీటిపై అధికారులు నియంత్రణ ఏమాత్రం లేదని టిడిపి కౌన్సిలర్ కోరాడ.నారాయణరావు అధికారులను నిలదీశారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా పట్టణ ప్రజలకు త్రాగునీరు సక్రమంగా ఎందుకు అందించలేక పోతున్నామని వైసీపీ, టిడిపి కౌన్సిల్ సభ్యులు అధికారులను ప్రశ్నించారు .ఈ విషయంపై శాసనసభ్యులు బోనెల. విజయ్ చంద్ర సమాధానం ఇస్తూ అందరి సహకారంతో త్వరలోనే ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. అనంతరం 8వ వార్డు కౌన్సిల్ సభ్యులు నారాయణరావు మాట్లాడుతూ అనధికార లే అవుట్లు, అక్రమ కట్టడాలపై పత్రికలలో కథనాలు ప్రచురితమైనప్పటికీ అధికారులు ఆ నిర్మాణాలను అడ్డుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.బైపాస్ రహదారిలో బఫర్ జోన్ ఉన్నప్పటికీ 40 అడుగులకన్నా మించి కట్టరాదని మునిసిపల్ నిబంధనలు ఉన్నప్పటికీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారి ఈ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఇది ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకమని ఆయనకు తెలియదా అన్నారు.అలాగే 14 శాతం మున్సిపాలిటీకి చెల్లించవలసిన ఫీజు కార్యాలయానికి కట్టకుండానే భవన యజమానులు నిర్మాణాలు కొనసాగిస్తున్నారని అటువంటి నిర్మాణాల వల్ల మున్సిపల్ ఆదాయానికి గండిపడుతుందని మున్సిపాలిటీలో ప్రభుత్వానికి అధిక మొత్తంలో ఆదాయాన్ని తెచ్చిపెట్టేది పట్టణ ప్రణాళిక విభాగమని కానీ ఆ ఆదాయానికి ఆ విభాగ అధికారులే తూట్లు పొడుస్తున్నారన్నారు. వైసిపి కౌన్సిల్ సభ్యులు సమావేశం నుంచి బయటికి వెళ్లిపోవడంతో ప్రజా సమస్యలపై టిడిపి కౌన్సిల్ సభ్యులు మాట్లాడారు. అనంతరం కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సమావేశంలో డి ఈ కిరణ్, అసిస్టెంట్ ఇంజనీర్లు ఆనందరావు, సన్యాసిరావు, టిపిఓ కనకారావు, రెవెన్యూ అధికారి రూబేన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు నారాయణరావు వినయ్ కుమార్ జేఏవో అశోక్ కుమార్ శానిటరీ ఇన్స్పెక్టర్ మురళి తో పాటు పలు విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలకు ఆన్లైన్లో పర్మిషన్ చేసుకోండి

- **ఎస్ఎస్‌సిజిడి కానిస్టేబుల్ పోస్టులకు ఉచిత కోచింగ్**
- **సీఐ సిహెచ్ వెంకట్రావు వెల్లడి**

విశాలాంధ్ర-జి మాడుగుల : మండల పరిధిలోని వినాయక ఉత్సవాలు చేసుకునే గ్రామాల్లో ఫోన్లో యాప్ డౌన్లోడ్ చేసుకుని అదే యాప్ లో వినాయక చవితి ఉత్సవాలు కోసం ఆన్లైన్లోనే పర్మిషన్ తీసుకోవాలని జి మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ చొల్లంగి వెంకట్రావు తెలిపారు. జి మాడుగుల సిఐగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు గిరిజన ప్రాంతంలో 10వ తరగతి పాసైన గిరిజన నిరుద్యోగ యువకులు అందరూ త్వరలో నోటిఫికేషన్ ఇస్తున్న ఉద్యోగాల్లో ఎస్ఎస్సి జిడి కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఉచిత కోచింగ్ ఏర్పాటుచే జరుగుతుందని ఇందుకోసం మీయొక్క దరఖాస్తును మీ యొక్క పంచాయతీ సచివాలయ మహిళా పోలీసులకు అందజేయాలని కోరారు. అలాగే మీ యొక్క గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవడానికి పర్మిషన్ కోసం మీరు పోలీస్ స్టేషన్ కు రావక్కర్లేదు మీరు ఉన్న ప్రాంతంలోనే పోలీసులు పంపించే యాప్ డౌన్లోడ్ చేసుకుని అందులోనే మీ యొక్క గ్రామము స్థలము తదితర వివరాలను అప్లోడ్ చేసుకొని అనుమతి పొందొచ్చిన తెలిపారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో గంజాయి, నాటు సారా వ్యాపారాలకు దూరంగా ఉండాలని గంజాయి పంటలు పండించి, ఆ వ్యాపారాల్లో పాల్గొనడం మధ్యవర్తిత్వం చేయడము ఇలాంటి కార్యక్రమాలు దూరంగా ఉండాలని తెలిపారు దీనివల్ల మీ జీవితాలు నాశనం చేసుకోవద్దు అని తెలిపారు. అలాగే మీ ప్రాంతాల్లో వినాయక ఉత్సవాల సందర్భంగా ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానిత సంచరించినట్లయితే మీరు సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వినాయక ఉత్సవాలు పర్మిషన్ తప్ప లౌడ్ స్పీకర్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రోగ్రాములకు తప్పనిసరిగా ఆన్లైన్లో చలానా తీసుకోవాలని తెలిపారు.

తారాస్థాయికి చేరిన తెలుగు తమ్ముళ్ల వర్గ పోరు

ఇంచార్జి మార్పుపై లోకేష్‌కి ఫిర్యాదు చేసిన తెదేపా రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు

విశాలాంధ్ర-పాడేరు : గత సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర మొత్తం కూటమి ప్రభుత్వం గాలి వీచినప్పటికీ మన్యం ప్రాంతంలో సరైన అభ్యర్థుల ఎంపిక లోపం వలన ఎంపికైన అభ్యర్థులు పార్టీ క్యాడర్‌తో, ముఖ్య నాయకులతో సమన్వయం లోపించడంతో మన్యం నియోజకవర్గాలను చేయించార్చుకున్నారు. పాడేరు నియోజకవర్గంలో బలమైన క్యాడర్ ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ నియోజక వర్గానికి సేజార్చుకోవడం పార్టీ అధినాయకత్వం నియోజకవర్గ ఇంచార్జీలు, నాయకులతో ఓటమిపై వివరణ కోరగా స్థానిక రాష్ట్ర నాయకులు స్థానిక ఇంచార్జి(అభ్యర్థి) పార్టీ నాయకులను, క్యాడర్‌ని సమన్వయం చేయడంలో విఫలమయ్యారని, అందువలనే పాడేరు నియోజకవర్గాన్ని చెయ్ జార్చుకునే పరిస్థితి వచ్చిందని, కావున ఇప్పటికైనా అధినాయకత్వం స్పందించి ప్రజా బలం ఉన్న నాయకుల్ని, పార్టీ కార్యకర్తలతో సత్సంబంధాలు ఏర్పరిచి పార్టీని బలోపేతం చేసే నాయకుల్ని పాడేరు నియోజకవర్గానికి ఇంచార్జిగా ఎంపిక చేయాలని పాడేరు నియోజకవర్గ రాష్ట్ర నాయకులు, కిల్లు రమేష్ నాయుడు, కొట్టగుల్లి సుబ్బారావు, సోమేలి చిట్టిబాబు, కోర్రు రామూర్తి, మాజీ మంత్రి మత్స్యరాస మణి కుమారి, ఎం వి.వి.ప్రసాద్, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్‌లతో పాటు సుమారుగా 100మంది నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాల ఆత్మీయ సమావేశంలో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి లోకేష్‌కి తెలియపరచడం జరిగిందన్నారు. ఇప్పటికైనా మన్యం ప్రాంతంపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని నాయకత్వం, కార్యకర్తలతో సత్సంబంధాలు కొనసాగించే వ్యక్తికి పార్టీ అధిష్టానం నియోజకవర్గ ఇంచార్జీగా నియమించి పార్టీ క్యాడర్లో నమ్మకాని కలిగించి పార్టీని బలోపేతం చేయాలని పాడేరు నియోజకవర్గం రాష్ట్ర నాయకులు కార్యకర్తలు లోకేష్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన రాష్ట్ర నాయకత్వం తగు చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

ప్రత్యేక పోషణ మేలా

విశాలాంధ్ర-మారేడుమిల్లి : పోషణ మాసికోత్సవం సందర్భంగా, ఐసీడీఎస్ మారేడుమిల్లి ప్రాజెక్ట్ వారు 2024 సెప్టెంబర్ 2న సోమవారం మరేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఒక ప్రత్యేక పోషణ మేళాను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం, గ్రామీణ ప్రాంతాల గర్భిణీ స్త్రీల ఆరోగ్యాన్ని మెరుగు పరచడం, పోషణ విలువలపై అవగాహన పెంపొందించడం, మరియు సమర్థవంతమైన ఆహార అలవాట్లను అలవడించడంపై కేంద్రీ కరించబడింది. ముఖ్యంగా, ఈ మేళాలో సంపూర్ణతా అభియాన్ సూచికలను కూడా కవర్ చేస్తారు, తద్వారా గర్భిణీ స్త్రీలు ఆరోగ్యకరమైన పోషణను పొందడంలో వారికి అవసరమైన మార్గదర్శకాలు అందిస్తారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోషకాహార ప్రదర్శనలు, ఆహార తయారీ పద్ధతులు, మరియు పోషకాహార పరంగా సరైన విధానాలపై శిక్షణలతో పాటు, పోషకాహార కిట్లు పంపిణీ చేయడం వంటి కార్యకలాపాలు జరగనున్నాయి. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో పోషణపై అవగాహన పెంపొం దించి, ఆరోగ్యకరమైన సమాజం నిర్మించడంలో అనుకూల వాతావరణం సృష్టించడమే లక్ష్యం అని పత్రిక ప్రకటనలో ఎంపీడీఓ ఎ. వీర కిషోర్ తెలిపారు.

పీవో చేతులమీదుగా పింఛన్లు అందచేత

విశాలాంధ్ర-వై.రామవరం: రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం శనివారం వై.రామవరం మండలం లో సామాజిక పింఛన్ల ను లబ్దిదారులకు స్వయంగా అందచేశారు. ఎన్టీర్ భరోసా క్రింద పింఛన్లు సకాలంలో అందుతున్నా యని పిఓ లబ్దిదారులకు అడగ్గా లబ్దిదారులు సంతృప్తి వ్యక్త పరిచారు. అనంతరం ఆయన యార్లగడ్డ ఆశ్రమ, పి. యర్ర గొండ ఏకలవ్య పాఠశాల, గురుకుల కళాశాలలు సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే మెనూనే అందించాలని వసతి గృహ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో కె.బాపన్న దొర, సచివాలయం సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

3న సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా వి ఆర్ పురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో మంగళవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కారం లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించబడునని, ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు మండల సమస్యలపైతగు సమాచారంతో తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అరకు పార్లమెంట్ ఇన్చార్జ్ చత్రుచర్ల జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ అరకు పార్లమెంట్ ఇన్చార్జ్ చత్రుచర్ల పరీక్షిత్ రాజు జన్మదిన వేడుకలు ఎంపీపీ దీనమయ్య ఆధ్వర్యంలో ఆయన చాంబర్లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీనమయ్య, జి గిరిబాబు, ఎంపీటీసీ, సర్పంచులు, వైయస్సార్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

తురబాడ మలుపు వద్ద కోళ్ల వ్యాన్ బోల్తా

చుట్టుపక్క గ్రామాల ప్రజలకు పండగే పండగ
లంబసింగి ఘాటి రోడ్డులో వ్యర్థాలతో దుర్గంధం
బర్డ్ ఫ్లూ వ్యాధి ప్రబలే అవకాశాలు
పట్టించుకోని ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం

విశాలాంధ్ర-చింతపల్లి : చింతపల్లి - నర్సీపట్నం ప్రధాన రహదారి లంబసింగి ఘాటి రోడ్డు తురబాడ ప్రమాదకర మలుపు సమీపంలో శనివారం ఉదయం కోళ్ల వ్యాను బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నర్సీపట్నం ప్రాంతానికి చెందిన కోళ్ల వ్యాపారస్తుని వ్యాను చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళుతుండగా తురబాడ సమీప మలుపు వద్ద బోల్తా పడింది. ఆ సమయంలో విపరీతంగా వర్షం కురవడంతో కోళ్లు మొత్తం వర్షానికి తడిసి మృతి చెందాయి. వ్యాను బోల్తా పడిన ఘటన చుట్టుపక్కల ప్రజలు తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకొని చనిపోయిన కోళ్లను కవర్ సంచుల సహాయంతో ఎక్కువ మొత్తంలో పట్టుకుపోయారు. అదే క్రమంలో చింతపల్లి, జికే వీధి మండలాల వారపు సంతలలో విక్రయించిన కోళ్లు, చేపల వ్యర్థాలను వ్యాపారస్తులు లంబసింగి ఘాటి రోడ్డు వద్ద ఇష్టానుసారంగా పడవేయడంతో లంబసింగి ఘాట్ రోడ్డులో వ్యర్థాల కారణంగా దుర్గంధం వెదజల్లుతుంది. చింతపల్లి నర్సీపట్నం లంబసింగి ఘాట్ రోడ్ గుండ వెళ్లే ప్రయాణికులు దుర్గంధంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ దుర్గంధం వాహన చోదకులు, ప్రయాణికులు పీల్చడం వలన బర్డ్ ఫ్లూ వ్యాధి సోకే ప్రమాదం ఉందని పలువురు మేధవులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వాలు, పాలకులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం తగదని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఘాటీ రోడ్డులో దుర్గంధం వెదజల్లకుండా చర్యలు తీసుకోలేరా... అని ప్రభుత్వానికి, పాలకులకు ప్రశ్నిస్తున్నారు. కోళ్ల వ్యాను బోల్తా పడడంతో సంఘటన స్థలం నుంచి ప్రజలు మృతి చెందిన కోళ్లను పట్టుకొని వెళ్లి గ్రామాలలో పెద్ద పండగ చేసుకుంటున్నారు. మృతి చెందిన కోళ్లను తినటం వలన ఆ చుట్టుపక్కల ప్రజలకు విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. గడిచిన రెండు నెలల కాలం నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా మన్య ప్రాంతంలో విష జ్వరాలు బారినపడి గిరిజనులు ఇంటికే పరిమితం అవతున్న నేపథ్యంలో మృతి చెందిన కోళ్లను తింటే ప్రాణహాని జరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆరోగ్యశాఖ జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారుల జిల్లా యంత్రాంగం స్పందించి ఆ చుట్టుపక్కల గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఈ సంఘటనలో సుమారుగా 15 లక్షల వరకు కోళ్ల వ్యాపారస్తుడు నష్టపోయినట్లు విశ్వసనీయ సమాచారం ఉంది. ప్రభుత్వ జిల్లా యంత్రాంగం యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టి ఇటువంటి సంఘటనలు పునర్వృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టీడిపి నాయకుల చేతులమీదుగా పెన్షన్ పంపిణీ

విశాలాంధ్ర-ఎటపాక: ఎటపాక మండలం గన్నవరం సచివాలయం పరిదిలో టీడీపి సీనియర్ నాయకులూ బొల్లా పుల్లయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు 4వేల రూపాయలు పెన్సన్ శనివారం అందజేశారు. సచివాలయం సిబ్బంది ఐదు గంటల నుండి ఇంటింటికి తిరిగి పెన్షన్లు పంపిణీ స్థానిక పాత్రికేయులు వసంతాలు రమేష్ గ్రామంలోనీ సచివాలయం సిబ్బందితో ప్రతి ఇంటికి తిరుగుతూ పెన్షన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సి ఎం పవన్ కల్యాణ్ కి హర్షంవ్యక్తంచేశారు. జరుగుతున్నది వర్షం కూడా లెక్కచేయకుండా సిబ్బంది విజయవంతంగా పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుంది పెన్షన్ దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు . సచివాలయం సిబ్బంది విఆర్వో వీరమ్మ, వెల్ఫేర్ జయలక్ష్మి, వేటనరీ రామ్ ప్రసాద్, భార్గవి, ,,, మహిళా పోలీసు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ని సస్పెండ్ చేసిన అధికారులు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలంలోని కిండ్ర ఫీల్డ్ అసిస్టెంట్ గంటిమళ్ళ నూకరత్నం ని అధికారు సస్పెండ్ చేసారు. ఇటీవల జరిగిన ఎన్ఆర్ జిఎస్ సామజిక తనిఖీ లలో కిండ్ర గ్రామంలో చెరువు పనులు చేయకుండ, చేసినట్లు చూపడంతో సుమారు రూ.55000 లు అవకతవకలు జరిగాయని గుర్తించిన ఉన్నతాధికారులు ఆమెను టెంపరరి అవుట్ ఆఫ్ కాంటక్ట్ (సస్పెండ్) చేసారని ఎంపిడిఓ యాదగిరేశ్వరావు, ఏపిఓ సురేష్ కుమార్ లు తెలిపారు.

ఒకే నెలలో రెండు ఫించన్ల పంపిణీ చారిత్రాత్మకం

విశాలాంధ్ర-కురుపాం : సెప్టెంబర్ 1 ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగా ఆగస్టు 31న రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చంద్రన్న ఫించన్ భరోసా పంపిణీ చేయడం తో ఒకే నెలలో రెండు ఫించన్లు పంపిణీ చేసినట్టైందని ఈ ఘటన చారిత్రాత్మక చర్య అని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కెవి కొండయ్య అన్నారు. ఆదివారం ఉదయం శివాల వీధిలో పెన్షన్ లను ఎంపీడీవో ఎస్ అప్పారావు తో కలిసి పంపిణీ చేశారు. తెలుగు దేశం పార్టీ నాయకులు సురేష్, త్రిపురనాథ్, వెంకట రమణ ,జనసేన నాయకులు ఎన్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

తుఫాను పట్ల జిల్లా యంత్రాంగం అప్రమత్తం

కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: తుఫానుపట్ల జిల్లా యంత్రాంగంగాన్ని జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ అప్రమత్తం చేశారు. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేశారు.అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్పి, సీహెచ్ డబ్ల్యులతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆయన ఆదేశించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శనివారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్-08963 293046 ఏర్పాటు చేశామన్నారు. పార్వతీపురం, పాలకొండ ఆర్‌డిఓ కార్యాలయాలతో పాటూ అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు యిబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, విపత్తులు సంభవించే అవాశాలు ఉన్న ప్రదేశాలు గుర్తించాలని జిల్లా కలెక్టర్ రెవిన్యూ అధికారులను ఆదేశించారు. విపత్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రెవిన్యూ అధికారులను ఆదేశించారు.అవసరమైతే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలను, సరుకులను తరలించుటకు అవసరమగు ఇంధనం కోసం పెట్రోల్ బంక్ లను అనుసంధానం చేయాలని ఆయన ఆదేశించారు. పునరావాస కేంద్రాలలో ఆహార సరఫరాకు ఏర్పాట్లు ఉండాలని, ఎం.ఎల్.ఎస్ పాయింట్లు అనుసంధానం చేయాలని ఆయన ఆదేశించారు. మధ్యాహ్న వంట ఏజెన్సీలను సిద్ధం చేయాలని ఆయన అన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, బాలింతలను దృష్టిలో పెట్టుకొని వారికి అవసరమగు పాలు, బిస్కెట్లు, రొట్టెలు తదితర సామాగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆయన పేర్కొన్నారు. గ్రామ రెవిన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులను అప్రమత్తం చేయా లన్నారు. రోడ్లపై చెట్లు పడిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడితే వెంటనే చెట్లను తొలగించుటకు అవసరమగు పరికరాలు, అందుకు కావలసిన మెషినరీ, కట్టర్స్, జె.సి.బిలు సిద్ధం చేసి తక్షణ చర్యలు చేపట్టుటకు వీలుగా వివిధ మండలాల్లో ఉంచాలని ఆర్ అండ్ బి, అగ్ని మాపక విపత్తుల శాఖను ఆదేశించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్ సిబ్బంది చెరువులు, అనకట్టలు తనిఖీ చేయాలన్నారు. సిబ్బంది 24 గంటలు అప్రమత్తం గా ఉండాలని, గేట్లు, లాకులు తనిఖీ చేసి సక్రమంగా పనిచేసేటట్లు చూడాలని, అవుట్ ఫ్లో సక్రమంగా ఉండే విధంగా చూడాలని ఆయన అన్నారు. మత్స్య శాఖ దేశీయ మత్స్యకారులకు సూచనలు చేయాలని ఆయన ఆదేశించారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. వరదల సమయంలో ప్రజలు పాము, తేలు కాట్లుకు గురయ్యే ప్రమాదం ఉందని, వ్యాధులు ప్రభలుటకు అవకాశం ఉందని వాటి చికత్సకు కావలసిన మందులు సిద్ధం చేసుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులను అదేశించారు. వరదలు మరింత తీవ్ర రూపం దాల్చి విద్యుత్ అంతరాయం కలిగే అవకాశం ఉంటే తాగు నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ముందుగా టాంక్ లు నింపడం, జనరేటర్లను సిద్ధంగా ఉంచడం చేయాలని ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులలో విద్యుత్ అంతరాయం వలన చికిత్సలకు ఆటంకం లేకుండా ముఖ్యంగా అత్యవసర శస్త్ర చికిత్సలకు ఇబ్బంది కలగకుండా జనరేటర్లు, ఇన్వర్టర్లను సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం తక్షణం పునరుద్దరణకు సిబ్బంది, విడి పరికరాలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. విద్యుత్ అంతరాయం వలన కమ్యునికేషన్ వ్యవస్థకు అంతరాయం కలిగే అవకాశం ఉందని, సంభందిత టెలి ఆపరేటర్లు ముందస్తు ఏర్పాట్లు చేసి అంతరాయం కలుగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. తుఫాను, వరదల అనంతరం పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మునిసిపల్, పంచాయతీ

అధికారులను ఆదేశించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, వాటికి అవసరమగు ఆహారం అందించుటకు ఏర్పాట్లు చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. బ్లీచింగ్, క్లోరినేషన్ నిల్వలు సిద్ధంగా ఉంచాలని, తాగు నీటిని ఇంజినీరింగ్ సహాయకులు ద్వారా నెల రోజులు పాటు టెస్టింగ్ చేయాలని ఆయన ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా సోమవారం పాఠశాలలు, అంగన్వాడీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు పనిచేస్తాయని ఆయన చెప్పారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో రెవిన్యూ డివిజనల్ అధికారులు కె.హేమలత, వి.వి.రమణ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జలవనరుల శాఖ అధికారులు ఆర్ అప్పలనాయుడు, జగదీష్, జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ అధికారి శ్రీనుబాబు, జిల్లా మత్స్య శాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా ఆర్‌అండ్‌బి అధికారి ఎం.జేమ్స్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనులు గుర్తించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పనులు గుర్తించాలని, గిరిశిఖర, మారుమూల గ్రామాలకు రోడ్డు అనుసంధానత కలిగేవిధంగా పనులు చేపట్టాలని జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు కార్యాలయంలో ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. ద్వారా చేపట్టిన పనులపై పంచాయతీరాజ్, గ్రామీణనీటిసరఫరా, ఐటిడిఎ ఇంజనీరింగు అధికారులతో ఇంజనీరింగు పనులు ప్రస్తుత పరిస్థితిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో అంసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, పనులు వారీగా పురోగతిని సమీక్షించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పెండింగు పనులను పూర్తిచేయుటకు రానున్న 15 రోజులకు సంబంధించి ప్రణాళిక అందజేయాలని తెలిపారు. పనులలో నాణ్యత విషయంలో రాజీకూడదని, చేసిన నిర్మాణపనులు పటిష్టంగా ఉండాలన్నారు. నిర్మాణపనులను రెండు, మూడు స్థాయిలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇంజనీరింగు పనులకు సంబంధించి ప్రజాప్రయోజనాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, గిరిశిఖర, మారుమూల ప్రాంతాలకు రోడ్డు సదుపాయాలు కల్పిస్తూ పనులు ఆమోదించాలని, ఎనభై శాతానికి పైగా పూర్తయిన పనులను మొదటగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. గిరిజన గ్రామాలలో అంతర్గతరోడ్లు, కాలువలు,రక్షిత గోడలు నిర్మాణ పనులను గుర్తించాలని తెలిపారు. ఇంజనీర్లు వారి పరిధిలోని ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, ప్రతి గ్రామంలో చేపట్టవలసిన పనులు గుర్తించి ముందుగానే అంచనా వ్యయాలు సిద్దంచేసుకోవాలని తెలిపారు. మంజురైన పనులకు సంబంధించి పనులు చేపట్టని కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారిచే పనులు కేటాయించి పూర్తిచేయాలని తెలిపారు. 100రోజుల ఏక్షన్ ప్లాన్ లో భాగంగా ఆమోదించిన 10 కి.మీ. సి.సి.రోడ్లు, 10 కి.మీ. సి.సి.కాలువలు నిర్మాణపనులు పూర్తిచేయాలని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి సంబంధించి బోర్లకు సంబంధించిన సమస్త సమాచారం క్రోడీకరించుకోవాలని తెలిపారు. మంచినీటి సరఫరా పనులే కాకుండా బోర్లలో నీరు తగ్గిపోకుండా నీటి మట్టం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈసమీక్షా సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, పంచాయతీరాజ్, గ్రామీణనీటిసరఫరా, ఐటిడిఎ ఇంజనీరింగు అధికారులు పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగులను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలి : కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణలు చేసిన సేవలకు కృతజ్ఞతలు, అభినందనలు తెలియ జేస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని జిల్లా అభివృద్ధికి పనిచేయాలని కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. శనివారం పదవీవిరమణ చేసిన జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణలను వారి సేవలకు గుర్తింపుగా జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పదవీ విరమణ వీడ్కోలు సమావేశానికి కలెక్టరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా అధికారులు, సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ అధికారులు ఇరువురు జిల్లా ఆవిర్భావం నుండి వారి శాఖల ద్వారా ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ సేవలు అందేలా కృషిచేసారని కొనియాడారు. నిరంతరం ఉద్యోగబాధ్యతలకు అంకితమై క్రింది స్థాయి ఉద్యోగులను నిరంతరం మార్గదర్శకత్వం చేస్తూ

మంచి ఫలితాలు తీసుకువచ్చారన్నారు. మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేయుటకు పంచాయతీరాజ్ శాఖ కృషి చేయగా, ప్రజా సంక్షేమంకొరకు పారిశుధ్యం నిర్వహణలో పంచాయతీ అధికారులు నిరంతరం కృషిచేస్తున్నారని తెలిపారు. వారి పనితీరును, క్రమశిక్షణను అలవర్చుకొని తరువాత అదికారులు పనిచేయాలని, వారిని మార్గదర్శకు లుగా స్ఫూర్తిని పొందాలని సూచించారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణాజి మాట్లాడుతూ ఉద్యోగభాద్యతలలో భాగంగా జిల్లాలోని మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మాణాలు చేపట్టి, గిరిజన గ్రామాలకు రవాణా సౌకర్యం కల్పించడం ఎంతో సంతోషాన్ని కలిగించిందని, గిరిజనులకు సేవచేసే అదృష్టం కలిగినందుకు ఆనందిస్తున్నానని తెలిపారు. ఉద్యోగ బాధ్యతలలో భాగంగా సహాయ సహకారాలు అందించిన ఉన్నతాధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తిని ఇచ్చిందని తెలిపారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టి ఉద్యోగిగా ప్రజలకు సేవలందించానని, వృత్తి ధర్మాన్ని ప్రతిఒక్కరు పాటించాలన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించి పనిచేయాలని, ప్రజలకు సేవచేస్తే భగవంతుడు కూడా మనకు మంచిచేస్తాడని తెలిపారు. ఈ సమావేశంలో జాయింటు కలెక్టరు ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి జి.కేశవనాయుడు, ఆర్.డి.ఓ. కె.హేమలత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎల్. రమేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొని వారి సేవలను కొనియాడారు.

ఉత్తమ సేవలకుగాను ప్రశంసపత్రాలను అందచేసిన ఎస్పీ

విశాలాంధ్ర - సీతానగరం : పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు చేసినందుకుగాను సీతానగరం ఎస్సై ఎం రాజేష్, కానిస్టేబుల్ ఎస్.సంపత్‌లకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. శుక్రవారంనాడు జరిగిన జిల్లాస్థాయి క్రైమ్ మీటింగ్లో వారికి ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ఎస్సై ఎం రాజేష్, కానిస్టేబుల్ సంపత్‌లను పోలీస్‌స్టేషన్ సిబ్బంది, మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

ఉన్నత, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలపై డిప్యూటీ డిఈఓ విచారణ

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని నిడగల్లు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల హెచ్‌ఎం మనోజ్ కుమార్, ప్రాథమిక పాఠశాల హెచ్ ఎం రుత్తల ఉమామహేశ్వరరావులపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు విచారణ చేసినట్లు డిప్యూటీ డిఇఓ బత్తుల రాజకుమార్ తెలిపారు. ఈరెండు పాఠశాలలో జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలపైన, వారు పాఠశాలలో నిర్వహిస్తున్న రికార్డుల నిర్వహణపైన, ప్రభుత్వం నిర్దేశించిన బోధన సక్రమంగా జరుగుతుంది లేనిదీ తదితర అంశాలపై విచారణ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. నివేదికను జిల్లా విద్యాశాఖ అధికారి గారికి అందజేస్తామన్నారు. ఆయనతోపాటు మండల విద్యాశాఖ అధికారి-2 మువ్వల వెంకటరమణ పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నాడు సేవా కార్యక్రమలు చేయండి

ప్రెసిడెంట్ బీశెట్టి సత్య

విశాలాంధ్ర-మారేడుమిల్లి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ రెండవ తేదీ సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా మారేడుమిల్లి మండలంలో జనసేన కార్యకర్తలు, జన సైనికులు పెద్ద ఎత్తున ప్రతి గ్రామంలో మొక్కలు నాటి సేవా కార్యక్రమంలో పాల్గొనాలని జనసేన మండల ప్రెసిడెంట్ మళ్ళా దుర్గాప్రసాద్, మండల జనసేన యూత్ ప్రెసిడెంట్ బీశెట్టి సత్య ప్రకటన లో తెలిపారు.

తల్లిదండ్రులు జ్ఞాపకార్థం దుప్పట్లు, బోజనాలు పంపిణీ

విశాలాంధ్ర-కురుపాం : తమ తల్లిదండ్రులైన మంతిన సూర్యనారాయణ నాయుదు, కౌశల్యమ్మ ల జ్ఞాపకార్థం వారి పిల్లలు వాసుదేవ రావు నాయుదు, సుశీల, నాగరత్నంలు శనివారం కురుపాం హుకుంపేట, దిగువ వీధులకు చెందిన నిరుపేద వృద్దులకు దుప్పట్లు, బోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తోటి వారికి చేతనైనంతలో సహాయం చేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. ఎంపీపీ శెట్టి పద్మావతి, బలగ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు చిత్తశుద్ధితో ఉన్నాం

విశాలాంధ్ర-పాలకొండ : డంపింగ్‌యార్డు ఏర్పాటుకు తమంత చిత్తశుద్ధితో పని చేస్తున్నామని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, 5వ వార్డు కౌన్సిలరు వెలమల మన్మథరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ గత మూడేళ్లలో తమ ప్రభుత్వ హయాంలో కూడా డంపింగ్ యార్డుకు అనేక ప్రాంతాల్లో స్థలాలు గుర్తించాం. అప్పటి ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ చొరవతో అనేక ప్రాంతాలు డంపింగ్ య ఆర్డు స్థలాలను కేటాయించారన్నారు. అక్కడ వివాదాలు తలెత్తతడంతో నిలిచిపోయన్నారు. పట్టణంలో తెలుకువలని చెరువు వద్ద డంపింగ్ యార్డు ఉండగా అక్కడ తొలగించాలని టీడీపీ నాయకులు అడ్డుకున్నారని, మరల ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చొరవతో కలెక్టర్‌ను కలిసి బెజ్జి దగ్గరలో ఐదు ఎకరాలు డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించారు. అక్కడ కూడా టీడీపీ నాయకులు అడ్డుకున్నారుని చెప్పారు. ఓనికి వెళ్లే ప్రాంతంలో బత్తినివాని చెరువు దగ్గర చెత్తను వేయగా రైతులు వ్యతిరేకించారన్నారు. దీని వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయిన ప్రస్తుతం సింగన్నవలస పంచాయతీదగ్గర డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడనికి కూడా తాము చిత్తశుద్ధితో ఉన్నామన్నారు.

అస్వస్థతకు గురైనా... తీరు మారని మెనూ

పాఠశాలలో నేనే రాజు... నేనే మంత్రి ప్రధానోపాధ్యారాలి తీరు

విశాలాంధ్ర-దుంబ్రిగుడ: మండలంలోని జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఉడికి ఉడకని నాసిరకం ఆహారాన్ని తిని శుక్రవారం రాత్రి శనివారం వరకు సుమారు 105 మంది విద్యార్థినిలు ఫుడ్ పాయిజన్ తో అస్వస్థతకు గురైన స్థానిక ఆ పాఠశాలలో శనివారం కూడా భోజనం మెనూ అమలులో తీరు మారలేదు. శనివారం ఉదయం విద్యార్థులకు పెట్టిన అల్పాహారంలో పులిహార ఉండగా అది ఉప్మా మాదిరిగా నాసిరకంగా వండి పెట్టారు. దీంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తీరు నేనే రాజు... నేనే మంత్రి... అన్న విధంగా ఉందని పలువురు అంటున్నారు. మధ్యాహ్నం పెట్టిన వంకాయ బటాని కూరలు బఠాణి ఉడకలేదు. సాంబార్ లో విద్యార్థుల సంఖ్య సరిపడే తప్పు కలపకుండా చాలీచాలని పప్పు కలపడంతో అది సాంబార్ కు బదులు రసం లాగా ఉంది. దీంతోపాటు అక్కడి విద్యార్థులతో కూరగాయలు నిలువ ఉండే గదిని కూడా విద్యార్థులచే శుభ్రం చేయించడం పలువురిని విస్మరిస్తుంది. శనివారం ఆ పాఠశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో అభిషేక్, డిడి కొండలరావు బోజన మెనునూ పరిశీలించారు. నాసిరకంగా ఉండడంతో నిర్వాహకుల తీరుపై సహనాన్ని వ్యక్తం చేశారు. ఉడికి ఉడకని భోజనం విద్యార్థులకు పెట్టి అస్వస్థతకు గురై విద్యార్థులు ప్రాణాలతో హాస్పిటల్ లో పోరాడుతుంటే అక్కడి పాఠశాల నిర్వాహకుల్లో కొద్ది కూడా చలనం లేకుండా శనివారం కూడా విద్యార్థులకు నాసిరకంగా అల్పాహారం భోజనం పెట్టడం విచారకరం. ఫుడ్ పాయిజన్ అయ్యి అస్వస్థత గురైన సంఘటనను తెలుసుకున్న ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు కూడా భోజనం మెనూ పరిశీలించి అవి నాసిరకంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత సంఘటన జరిగిన హాస్టల్ నిర్వాహకుల్లో కనీసం మార్పు లేక పోవడంపై నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని అక్కడ సందర్శించిన అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ పాఠశాలలో విద్యార్థులకు సురక్షిత నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ గత ఏడాది నుంచి మరమ్మతు గురవడంతో విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు అందడం లేదు. తాగునీరు వాడుక నీటి కోసం ఓకే నీటిని ఉపయోగిస్తున్నారు. అక్కడ ఉన్న బావి కూడా పూర్తిగా శిథిలావస్థలో ఉండి బావిలో నీరంతా కలుసితంగా ఉంది. గతంలో ఈ బావిలో నీటిని ఉపయోగించేవారు. అయితే బావిలో ఏర్పాటు చేసిన మోటర్ పనిచేయక పోవడంతో ప్రస్తుతం ఉపయోగించడం లేదు. సురక్షితమైన తాగునీటి సౌకర్యం లేక కలుషితమైన తాగునీటి ఉపయోగించడం వల్ల విద్యార్థులు పలు అనారోగ్యాలకు గురయ్యే పరిస్థితి ఉంటుంది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతకు గురైన ఆరో ప్లాంట్ ను మరదలు చేసి విద్యార్థులకు సురక్షితమైన తాగునీటిని కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గిరిజన సంఘం నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి కోరారు.

సింగిల్ విండో సిస్టం ద్వారా వినాయక చవితి నిర్వహణకు అనుమతులు : ఎస్ఐ రాజేష్

విశాలాంధ్ర - సీతానగరం : పార్వతీపురం మన్యంజిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు వినాయకచవితికి సంబంధించి అనుమతులను సింగిల్ విండో సిస్టం గణపతి నవరాత్రి ఉత్సవాలకు అనుమతులు మంజూరు చేయబడునని ఎస్ఐ రాజేష్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో వినాయక చవితి ఏర్పాట్లపై మాట్లాడారు. గణేష్ ఉత్సవ అనుమతి లింక్ %హ్ట్జా:// ప్తుఖఅవంప్త బ్యిఖజ.అవ్% ను సంప్రదించడం లేదా అనుమతులకోసం 7995095800 సెల్ ఫోన్ కు మిస్డ్ కాల్ చేయండని ఆయన తెలిపారు. రెవిన్యూ, పోలీస్ ,అగ్నిమాపక శాఖ, మున్సిపల్, కాలుష్య నియంత్రణ మండలి, విద్యుత్ శాఖ అధికారులతో కూడిన సింగల్ విండో వ్యవస్థను అమలు చేయడం ప్రారంభించడం జరిగిందన్నారు. వారంతా స్పాట్ విజిట్ మరియు వెరిఫికేషన్ చేస్తున్న తర్వాత నిర్వాహకులకు క్యూఆర్ కోడ్ పంపించడం జరుగుతుందన్నారు. దీనిని గణేష్ ఉత్సవాలు వద్ద అతికించాలన్నారు. పోలీస్ భద్రత చర్యలను ట్రాక్ చేయడంలో ఇది ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ సింగిల్ విండో సిస్టం ద్వారా నిమజ్జనం తేదీ, మరియు స్థలం ,విగ్రహంఎత్తు, మరియు నిర్వాహకుడి వివరాలు అన్నీ కలిపి మొత్తంసమాచారం ఒకేచోట నిక్షిప్తమై ఉంటుందన్నారు. వినాయక చవితి ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించే ప్రజలు , యువత పోలీస్ వారు అందజేస్తున్న ఈగణేష్ ఉత్సవ అనుమతి లింకులను ఉపయోగించి తద్వారా సింగిల్ విండోస్ సిస్టంకు ఉపయోగించి గణేశ్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక పోలీస్ స్టేషన్ సంప్రదించాలన్నారు.

గులిరాగిలో సైకిల్ వీడర్ ఎంతో అవసరం

వ్యవసాయ అధకారి తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట : వినూత్నమైన గావ్ చోడి పంట పొలంబడి లో భాగంగా ఆరవ వారం రైతులకు గుళి పద్ధతిలో చోడి పంట పండించే పద్ధతి పై వ్యవసాయ అధికారి తిరుపతిరావు రైతులకు శిక్షణ ఇచ్చారు. పెదకన్నూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె తిరుపతిరావు మాట్లాడుతూ పంటలను వరుసలలో వేసుకుంటే తేలిక నేలలలో సైకిల్ వీడర్ తో కలుపు నివారణ సులువుగా చేసుకోవచ్చని అన్నారు .చోడి పంటను గుళి పద్ధతిలో పండిస్తే ఎకరానికి 18 క్వింటాలకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నారు. రైతు క్షేత్రాలలో ఇది నిరూపితం అయిందని తెలిపారు .ఈ పద్ధతిలో ముందుగా చోడి పంట నారుని ఎత్తైన నారుమడిలో పెంచుకుని 15 రోజుల లోపు అడుగున్నర దూరంలో ఒక్కొక్కటిగా మొనలను నాటుకొని మూడు నాలుగు సార్లు పంట కాలంలో ఎకరానికి ఒక్కొక్క దఫా 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని వేసుకోవాలని అన్నారు.15 మరియు 25 రోజులకు ఒక తేలికైన కలప చెక్కను చేనుపై లాగాలని దీనివలన దుబ్బులు కదిలి ఎక్కువ పిలకలు వస్తాయని అలాగే రెండుసార్లు సైకిల్ వీదరు తో వరుసల మధ్య కలుపు నివారణ చేపడితే అత్యధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం సైకిల్ వీదరు తో కలుపు నివారణను రైతులకు చూపించారు. పొలం బడిలో ప్రతి వారం ఒక వినూత్నమైన కార్యక్రమం జరపబడుతుందని కేవలం పొలంబడి రైతులు మాత్రమే కాకుండా ఇతర రైతులు కూడా రావాలని కోరారు .ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు సురేష్ కుమార్ విజయ్ రాజు మరియు రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు : కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర-అరకులోయ : అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు ఐటిడిఏల పరిధిలో ఆశ్రమ పాఠశాలల పర్యవేక్షణకు పిఓల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. కలుషిత ఆహారం తిని అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జాముగుడ పాఠశాల విద్యార్థినులను పరామర్శించి పరిస్థితిని సమీక్షించిన అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. భవిష్యత్తులో జాముగుడ పాఠశాలలో జరిగినటు వంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకుగాను అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాల పరిస్థితులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాల ఏర్పాటు చేస్తున్న మన్నారు.జాముగుడ పాఠశాలలో శుక్రవారం సాయంత్రం 6:30 కు విద్యార్థులు డిన్నర్ చేశారని గంట తర్వాత వాంతులు విరేచనాలు కావడంతో వెంటనే అస్వస్థతకు గురైన విద్యార్థినులను హుటాహుటిన అంబులెన్సులలో ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు.ఈ ఘటన తెలిసిన వెంటనే జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో పాడేరు ప్రధాన ఆసుపత్రి నుండి ఆరుగురు వైద్యాధికారులను కూడా అరకులోయ ఏరియా ఆసుపత్రికి పంపించడం జరిగిందన్నారు. పాడేరు వైద్యాధికారులు, అరకులోయ ఏరియా ఆసుపత్రి డాక్టర్లు అస్వస్థతకు గురైన విద్యార్థినిలకు తక్షణ చికిత్స అందించారని కలెక్టర్ తెలియజేశారు.పాఠశాలలో విద్యమభ్యసిస్తున్న విద్యార్థినిలలో 61మంది అస్వస్థతకు గురయ్యారని వీరిలో 60 మంది ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని,ఒక విద్యార్థిని మాత్రం మలేరియా ఫీవర్‌తో బాధపడుతుందని ఆయన తెలిపారు.డిన్నర్ చేసిన ఏడో తరగతి నుండి పదవ తరగతి విద్యార్థునుల వరకు ఏఅనారోగ్య సమస్యలు రాలేదని, కింది తరగతి విద్యార్థినిలు మాత్రమే అస్వస్థతకు గురయ్యారని ఆయన చెప్పారు.కుళ్ళిన గుడ్లు తినడంవల్ల ఈఘటన జరిగిందని భావిస్తున్నా మన్నారు. ఆహారంలో ఏమి కలిసిందో ఫుడ్ ఇన్స్పెక్టర్, డాక్టర్లు తెలుసుకుంటారని ఆయన అన్నారు.మూడు మండలాల ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేసిన గుడ్లను వెంటనే వినియోగించకుండా ఆపివేయ వలసిందిగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వార్డెన్ లకు ఆదేశించడం జరిగిందన్నారు.కొత్త స్టాకు అన్ని పాఠశాలలకు చేరేలా చూస్తామన్నారు. జాముగుడ పాఠశాలకు వెళ్లి అక్కడ కిచెన్, వంట పాత్రలు కాయగూరలు ఇతర సరుకులు పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సరుకులన్నీ ఒకేచోట ఉండకుండా వేరువేరుగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. పాఠశాలలో శానిటేషన్ కూడా మెరుగుపరుస్తామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.పాఠశాల హెచ్‌ఎం, వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు స్పష్టం అవుతోంది అని ఆయన అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వార్డెన్ పై చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయుల మధ్య సమస్యలు ఉన్నట్లు అర్థమవుతుంది అన్నారు.జాముగుడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మొత్తం టీమ్ ని మార్చి వేస్తామని కలెక్టర్ స్పష్ట పరిచారు.ఇకపై అన్ని ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పెట్టేముందు నాణ్యతను పరిశీలించి వాటి ఫోటోలుతీసి ప్రాజెక్ట్ అధికారి కార్యాలయానికి పంపేలా పాఠశాల నిర్వాహకులకు ఆదేశిస్తామన్నారు.ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన మెనూ అమలయ్యేలా చూస్తామన్నారు. ఏటీడబ్ల్యు ఓ.,డీడీ కూడా ఎప్పటికప్పుడు ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసి మెనూ పరిశీలిస్తూ ఉంటారని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా, ఆసుపత్రి వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలి

డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ టి. జగన్మోహనరావు

విశాలాంధ్ర-కొమరాద : క్షేత్ర స్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ టి. జగన్మోహనరావు ఆదేశించారు సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులు సిబ్బంది ఎప్పటికప్పుడు అపరిమితంగా ఉండాలంటూ డిప్యూటీ డిఎంహెచ్వో అన్నారు. శనివారం కుమ్మరిగుంట గ్రామాన్ని ఆకస్మికంగా డిప్యూటీ డిఎంహెచ్వో సందర్శించారు.ముందుగా గ్రామ పరిసరాలను పరిశీలించి దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్న ప్రదేశాలు ఏమైనా ఉన్నాయా, ఎటువంటి నివారణ చర్యలు చేపడుతున్నారు అని సిబ్బందిని ఆరా తీశారు.డ్రైడే కార్యక్రమాల్లో ప్రతీ ఇంటి పరిసరాలను నిశితంగా గమనించి దోమల లార్వా గుర్తించాలన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని తనిఖీ చేసి నమోదు చేసిన ప్రజల ఆరోగ్య సమస్యల వివరాలు,రక్త పరీక్షలు పరిశీలించారు.జ్వరాలు,రక్తహీనత ఉన్న వారిని నివారణయ్యేవరకు పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. అనంతరం గర్భిణిల గృహ సందర్శన చేసి ఎంసిపి కార్డులను తనిఖీచేసి వారికి అందుతున్న వైద్య సేవలపై, అంగన్వాడీ సిబ్బంది అందజేస్తున్న పౌష్టికాహారం వివరాలపై అడిగి తెలుసుకున్నారు. ఆర్ఎల్ పురం హెల్త్ వెల్నెస్ కేంద్రం పరిధిలో ఉండే గర్భిణిలలో రక్త హీనతగా గుర్తించిన వారి జాభితా సిద్ధం చేయాలని, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి హిమోగ్లోబిన్ శాతం పురోగతి చెందేలా కార్యాచరణ చేపట్టాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజారోగ్య సమస్యలను గుర్తించడంలో జాప్యం ఉండకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమిక్ సెల్ ఈఓ సత్తిబాబు, వైద్య సిబ్బంది వాణి, శారద, అప్పలనాయుడు, ఆశ కార్యకర్తల తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బంగ్లాలో వాచ్‌మెన్‌లు పదవీ విరమణ

విశాలాంధ్ర-సీతంపేట : ఐటిడిఏ బంగ్లాలో వాచ్మెన్‌గా విధులు నిర్వహిస్తున్న గొర్లె కుప్పేశ్వరరావు, నిమ్మక రామారావు, ధన్ బహుదూర్ లు ఈరోజు పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బంగ్లాలో ఎంతో నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించారని అన్నారు. ఉద్యోగ రీత్యా పదవీ విరమణ సాధారణం అని అన్నారు. ఈ సందర్భంగా వారికి సన్మానం చేసి, కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీ అన్నదొర పీహెచ్ వో గణేష్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.